ప్రజాశక్తి

ఆదివారం 15 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖకు జగన్ రాకపై..

సొంత పార్టీలో తర్జనభర్జన

తాజా పరిస్థితుల్లో అంత ఈజీ కాదని వైసిపిలోనూ చర్చ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఓ పక్క ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ చేసి జైలులో పెట్టడం, మరోపక్క వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉధృతంగా కార్మిక, ప్రజా పోరాటం సాగుతుండటం, ఇంకో పక్క విశాఖకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మకాం మారుస్తుండటం వంటి అంశాలపై జిల్లా వాసుల్లో ప్రధాన చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో విశాఖకు ఈ దసరాకు జగన్ వచ్చి కూర్చొంటారా ? అంటే అధికార పార్టీ శ్రేణులూ మీనమేషాలే లెక్కిస్తున్నాయి. గతంలో చెప్పినట్టు ప్రస్తుతం నేతలు ఠక్కున జవాబివ్వలేకపోతున్నారు. విశాఖలో క్రైం రేటు... అంటే భూ కబ్జాలు, కిడ్నాప్‌లు, మర్డర్లు, డ్రగ్స్ వ్యవహారాలు వంటివి అధికార పార్టీని గడిచిన కొద్ది నెలల నుంచీ కలవరపెడుతున్నాయి. విశాఖకు రాజధాని కావాలా ? లేదా ? అన్న అంశంపై ప్రజల్లో కనిపిస్తున్న మిశ్రమ స్పందనే ఆ పార్టీలోనూ ప్రస్తుతం కనిపిస్తోంది. మూడేళ్ళుగా వైజాగ్ ప్రజానీకం, ఉత్తరాంధ్ర వాసుల ప్రధాన డిమాండ్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశం ఉంది. ఇప్పుడు ఉక్కు పోరాటమూ ఉధృతమవుతోంది. అధికార పార్టీ 'ఉక్కు'పై చిత్తశుద్ధితో వ్యవహరించకుండా ఉపరితలంపై విన్యాసాలు చేస్తూ పబ్బం గడుపుకోవడం ఈ ప్రాంత ప్రజలు గుర్తిస్తున్నారు.

సిఎం రాక నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం సమావేశమైన వైసిపి నాయకులు

విశాఖకు జగన్ వచ్చేనా ?

వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి సిఎం క్యాంపు కార్యాలయం విశాఖకు మార్పు విషయమై ఇటీవల మాట్లాడుతూ 'అక్టోబర్ కావచ్చు...నవంబర్ కావచ్చు' అనడం చూస్తే ప్రస్తుత పరిస్థితుల్లో అంత సులభం కాదన్నది సొంతపార్టీ వారికీ అర్థమైంది. అనుకున్న తేదీకి అటుఇటుగా సిఎం వచ్చి తీరుతారని పలువురు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలోనే సాగర తీరంలో రహదారుల విస్తరణ, రోడ్ల సుందరీకరణ వంటి పనులు రెండు నెలలుగా సాగుతూ ఉన్నాయి. విశాఖలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు సమీక్షలు జరిపి ఆదేశాలు జారీ చేసి వెళ్లిపోయారు. ఆ పనుల్లో అధికారులు తలమునకలై ఉన్నారు.

రకరకాల ఊహాగానాలు

వారంలో మూడు రోజులు జనంలో తిరిగేందుకు ముఖ్యమంత్రి వైస్ జగన్ రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. ప్రజల స్పందన బట్టి విశాఖకు నవంబర్‌లో ఓ దఫా మిగతా 2లో..

పాదయాత్ర నిర్వహిస్తున్న సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం నాయకులు

పంచ గ్రామాల సమస్యపై పాదయాత్ర

పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - పెందుర్తి : పంచ గ్రామాల సమస్యను పరిష్కరించాలంటూ సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పురుషోత్తపురం నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంకు వరకూ శనివారం సాయంత్రం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి టివి.కృష్ణంరాజు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పంచ గ్రామాల ప్రజలు భూ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు గెలిచిన వెంటనే సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా అతీగతీ లేదన్నారు. పాలకులు మారుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల పంచగ్రామాల ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారని తెలిపారు.

సిఎం జగన్మోహన్ రెడ్డి విశాఖ వస్తున్నారు.. వెళ్తున్నారు తప్ప సమస్యపై స్పందించడం లేదని మండిపడ్డారు. దసరా నుంచి సిఎం విశాఖ కేంద్రంగా పాలన సాగించనున్నట్టు వార్తలు వస్తున్నాయని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బి.అరుణ్ కుమార్, పి.రామారావు సిహెచ్ఎస్.గోపాలకృష్ణ, మాధవరావు, ప్రతాప్, పలు కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

'ఉక్కు'పై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

వార్త 2లో..

రుషికొండ స్వాహాకు జగన్ కుట్ర

వార్త 2లో..

తెగుళ్లతో వరి రైతుల్లో ఆందోళన

వార్త 3లో..

విశాఖ నగరంలో ఓ పరీక్షా కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న అభ్యర్థులు

ప్రశాంతంగా ఎస్ఐ రాత పరీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి పోలీస్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో విశాఖ నగరంలో శనివారం జరిగిన సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎపిఎస్‌పి) అభ్యర్థుల మెయిన్స్ పేపర్ - 1, పేపర్ -2 రాత పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. శనివారం ఈ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్, విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణలు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

కౌన్సిల్ అజెండాల నుంచి రూ.500 కోట్ల

అప్పు ప్రతిపాదన ఉపసంహరించుకోండి

సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కౌన్సిల్ అజెండాల నుంచి రూ.500 కోట్ల అప్పు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, ఆ పార్టీ 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం పలు విషయాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 19న జరగబోతున్న జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ప్రజలకు తీవ్ర హాని కలిగించే ప్రతిపాదనలు చేశారన్నారు. మధురవాడ జోన్‌లో వ్యర్థ నీటి కాలువల నెట్‌వర్క్ నిర్మాణాల కోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.500 కోట్లు అప్పు తీసుకోవాలని ప్రతిపాదించారని తెలిపారు. దీనివల్ల జివిఎంసి పూర్తిగా దివాళా తీస్తుందన్నారు. ప్రజలపై అనేక భారాలు పడతాయని తెలిపారు. ఇప్పటికే కేంద్ర బీజేపీ, ప్రపంచ బ్యాంక్ ఆదేశాలు ఆమోదించి అస్తి పన్నును అస్తి విలువతో ముడిపెట్టి భారీగా ఆస్తి పన్ను పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. చెత్తపై యూజర్ ఛార్జీలు విధించారన్నారు. త్వరలో కుళాయిలకు మీటర్లు బిగించి నీటి ఛార్జీలు, మురుగునీటి ఛార్జీలు పెంచబోతున్నట్టు తెలిపారు. కనుక సిపిఎం ఈ అప్పు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ఇప్పటికే జివిఎంసి అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఈ ఏడాదే 60 ఎకరాల భూమిని, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను బ్యాంకులో తనఖా పెట్టి సుమారు రూ.244 కోట్లు అప్పు తీసుకొచ్చారని తెలిపారు. ఉన్న అప్పులపై ఏడాదికి రూ.70 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నారన్నారు. రూ.960 కోట్లతో గాజువాక, మల్కాపురం, పెందుర్తి ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భ మురుగునీటి కాలువలు (యూజీడీ) నిర్మాణాలకు ఇంకా రూ.600 కోట్లు అప్పు కావాలంటూ, ఆ అప్పు కోసం జివిఎంసి ప్రధాన కార్యాలయం, రేశపువానిపాలెం వద్ద వున్న ఇండోర్ స్టేడియం, ఇతర అనేక భూములను తనఖా పెట్టే ఆలోచనలు చేస్తున్నారన్నారు. విశాఖ పశ్చిమ, ఉత్తర నియోజక వర్గాల్లో మంచినీటి సరఫరా పేర ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి రూ.350 కోట్లు అప్పు తీసుకొచ్చారన్నారు. ఇవన్నీ కలిపితే రూ.1350 కోట్లు అప్పు అవుతుందన్నారు. ఇవిగాక గాజువాక, మల్కాపురం యుజిడి ప్రాజెక్ట్ కోసం తీసుకురావాలనుకుంటున్న మరో రూ.600 కోట్లు కలిపితే మొత్తం రూ.1950 కోట్లు అప్పు అవుతుందన్నారు. దీంతో దేశంలోనే అత్యధిక అప్పుకలిగిన నగరంగా జివిఎంసి మారుతుందని తెలిపారు. ఈ అప్పు విషయంలో ఉన్న షరతులను వివరించారు. కూర్మన్నపాలెంలో స్థానిక ప్రజల నివాస రోడ్లను నిర్లక్ష్యం చేసి విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ నిర్మించిన అపార్టు మెంట్స్ ప్రయోజనం కోసం సుమారు రూ.11.50 కోట్ల నిధులతో 86వ వార్డు కూర్మన్నపాలెం ఆర్చి నుండి ఎంవివి పార్క్ అపార్టుమెంట్ వరకు రోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణాలకు కేటాయించడం పూర్తిగా అవాంఛనీయమైనదని పేర్కొన్నారు. ఒక వ్యక్తి ప్రయోజనం కోసం 86వ వార్డులోని 50 వేల మంది ప్రజల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సొంత పార్టీలో తర్జనభర్జన

వచ్చి కూర్చొని వెళ్లిపోవాలన్న ప్లాన్ కూడా లేకపోలేదు. ముఖ్యంగా చంద్రబాబు అరెస్ట్ అయ్యాక ప్రజల్లో ఏమైనా సానుభూతి పవనాలు ఉన్నాయా ? అన్న అంశాలను పరిశీలించాక తుది నిర్ణయం తీసుకోవచ్చు. అయితే తొలి నుంచీ విశాఖే మా రాజధాని అని సిఎం చెప్పినందున లాంఛనంగా వస్తారని పలువురు చెబుతున్నారు. ఈ నెల 16 తరువాత విశాఖలో ఇన్ఫోసిస్ కంపెనీ ప్రారంభమై యువతకు కాస్తయినా ఉపాధి కల్పించే పరిస్థితి కనిపించాక వైజాగ్ మకాం గురించి చూద్దాం అన్న చర్చ కూడా అధికార పార్టీలో నెలకొంది.

అప్ప ప్రతిపాదన ఉపసంహరించుకోండి

అవసరాలకు తిలోదకాలివ్వడం అవినీతికర చర్యగా భావిస్తున్నామన్నారు. కార్పొరేటర్లకు సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఏకపక్షంగా నగరంలో ఎగ్జిక్యూటివ్ అథారిటీ పేరుతో నగరంలో 18 రోడ్ల ప్రతిపాదన చేయడం స్థానిక సంస్థలను బలహీనం చేయడమే అవుతుందన్నారు. ఈ నియంతృత్వ కేంద్రీకృత చర్యను సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. అప్పికొండ వద్ద పిపిపి పేర 100 ఎంఎల్‌డి సామర్థ్యంగల డీ- సాలినేషన్ ప్రాజెక్ట్ కోసం చేసిన ప్రతిపాదన పూర్తిగా అవినీతితో కూడుకున్నదని తెలిపారు. వైసిపిలో ఉన్న బడానేత ప్రయోజనం కోసం ఈ ప్రాజెక్ట్‌ను తెరమీదకు తెచ్చారన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాగభూషణం

'ఉక్కు'పై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష కార్మిక సంఘాల, రాజకీయ పార్టీల నాయకులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానితో చర్చలకు అవకాశం కల్పించాలని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 924వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి హెచ్‌పిసిఎల్ విభాగం కాంట్రాక్టు వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి దాదాపు మూడు సంవత్సరాలు కావొస్తోందని, అంతకు మించి ఏ చర్యా తీసుకోలేదని తెలిపారు. ఉక్కుపై మౌనం దాల్చడం శోచనీయమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి సిఎం విశాఖపట్నం వస్తున్నారని చెప్పేముందు ఉత్తరాంధ్రలో ఏకైక భారీ పరిశ్రమైన స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాల్సిన అవసరముందన్నారు. దీక్షల్లో ఐఎన్‌టియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.నర్సింగరావు, ఎస్.తాతబాబు పాల్గొన్నారు.

డప్పు కళాకారుడు బి.రమణ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రముఖ డప్పు కళాకారుడు, ప్రజానాట్య మండలి కళాకారుడు బి.రమణ (52) గుండె జబ్బుతో హఠాత్తుగా మరణించారు. శుక్రవారం రాత్రి గుండె జబ్బుతో ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్నుమూశారు. అల్లిపురంలోని ఆయన గృహానికి పార్థివదేహాన్ని శనివారం తీసుకొచ్చారు. రమణ మరణవార్త తెలియడంతో ప్రజానాట్యమండలి నగర గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.చంటి, కార్యవర్గ సభ్యులు వై.అప్పారావు, కంచరపాలెం జోన్ నాయకులు రాంబాబు, మహేంద్ర, మద్దిలపాలెం జోన్ నాయకులు ఎన్‌వి.రమణ, సిఐటియు జగదాంబ జోన్ సీనియర్ నాయకులు వై.రాజు, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె. సంతోష్ కుమార్ తదితరులు అల్లిపురం వెళ్లి రమణ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. మధ్యాహ్నం జ్ఞానాపురం శ్మశాన వాటికలో రమణ అంత్యక్రియలు జరిగాయి. ప్రజా సమస్యలపై విశాఖ జిల్లాలో ప్రజాతంత్ర ఉద్యమాలు జరిగిన ప్రతి సందర్భంలోనూ, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, సామాజిక రక్షణ, కార్మికుల వేతన సమస్యలపై ప్రజానాట్యమండలి ఇచ్చిన ప్రతి పిలుపులోనూ రమణ గతంలో పాల్గొన్నారని ప్రజానాట్యమండలి కార్యదర్శి చంటి తెలిపారు. రమణకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య కూడా కళాకారిణిగా గుర్తింపు పొందారు. రమణ వంటి అద్భుత కళాకారుడు ఆకస్మిక మరణం పొందడం కళా రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని దండు నాగేశ్వరరావు అన్నారు.

బి.రమణ
(ఫైల్‌ఫొటో)

రుషికొండ స్వాహాకు జగన్ కుట్ర

మాజీ మంత్రి బండారు విమర్శ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రుషికొండను లీజు పేరిట కొట్టేయాలని సిఎం జగన్మోహన్ రెడ్డి చూస్తున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రతి మీటింగ్‌లో పేదోడని అంటాడని, అక్కడితో ఆగకుండా క్లాస్ వార్ అంటాడని తెలిపారు. పేదోడైన జగన్ బాత్ రూమ్‌కైన ఖర్చు రూ.కోటి, కమోడ్ ఖర్చు రూ.25 లక్షలు, బెడ్ రూమ్ ఖర్చు రూ.40 కోట్లు, వెరసి రుషికొండలో నిర్మాణాలకు ఇప్పటికే రూ.350 కోట్లు ఖర్చు చేశారని ఎద్దేవా చేశారు. జగన్‌కు ఇంత విలాసవంతమైన భవనం అవసరమా అని ప్రశ్నించారు. రుషికొండ లీజు ఎవరికిచ్చారు ? ఎంతకిచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు ఆరోగ్యం విషయంలో కోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. ఆయన్ని సూపర్ స్పెషాలిటీకి తరలించాలని కోరారు. పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రుషికొండలో ప్రభుత్వ నిర్మాణం వెనుక దుర్బుద్ధి ఉందని ఆరోజే చెప్పామన్నారు. సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవన్‌పై వ్యక్తిగత దూషణలు తగవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సిఎం జగన్మోహన్ రెడ్డి అదే పనిగా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఇప్పటికైనా వాటికి స్వస్తి చెప్పాలని.. లేకుంటే తగిన గుణపాఠం తప్పదని దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు పి.శివప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఎం జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కంటపల్లి త్రివేణి, కె.రూప, యడ్లపల్లి కళ, ఎర్రంశెట్టి సురేష్, అంగటి శ్రావణ్, గరికిన రవి, నీలం రాజు పాల్గొన్నారు.

జాలాదికి నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగువారి గొప్పతనాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి, సినీ పాటల రచయిత జాలాది రాజారావు అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కొనియాడారు. జాలాది 12వ వర్ధంతి సందర్భంగా శనివారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుమారు 250 చిత్రాలకు 1800 పాటలు రాసిన జాలాది తెలుగువాడు, విశాఖ నగరవాసి కావడం గొప్ప విషయమన్నారు. ఆయనకు దక్షిణాదిలోనే కాదు ఉత్తరాదిలో కూడా గొప్ప రచయితగా పేరు ఉందని తెలిపారు. ఆయన రాసిన పాటలు దేశభక్తి, సర్వమత సమానత్వానికి బాగా ఉపయోగపడ్డాయని తెలిపారు. జాలాది స్వాతంత్ర్య సమరయోధులుగానూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అనంతరం గ్రేసియస్ ఛారిటబుల్ సంస్థ ఆధ్వర్యాన అనాథ బాలికలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జాలాది విజయ, శ్రీనివాస్, ఆడారి కిషోర్, సినీ నిర్మాత నీల తిలక్, బలివాడ రమేష్, ప్రతాప్, చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం మేకర్స్ ఆత్మీయ కలయిక

కలెక్టరేట్ : వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 3 వరకు నిర్వహించిన ఫిలిం డైరెక్షన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న షార్ట్ ఫిలిం కళాకారులు, నగరంలో ఇతర కళాకారులు నేషనల్ ఫిలిం డే సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'కళాకారుల గెట్ టు గెదర్' పేరిట ఆత్మీయ కార్యక్రమం నిర్వహించుకున్నారు. షార్ట్ ఫిలిం మేకర్స్ అందరికీ అసోసియేషన్ తోడుగా ఉంటుందని, వారి కోసం నిత్యం వర్క్‌షాప్‌లు, ఫిలిం ఫెస్టివల్ వంటివి నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అష్రఫ్, కార్యవర్గ సభ్యులు దిలీప్ కుమార్, ఉమామహేష్, సంతోష్ పాల్గొన్నారు.

సాగరగిరికి నేటి నుంచి బోటు ప్రయాణం

కలెక్టరేట్ : యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరగిరి కనకదుర్గ దేవాలయానికి సముద్ర మార్గంలో వెళ్లేందుకు ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాదీ ప్రైవేటు బోట్లను నడుపుతున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోని 1, 2 జెట్టీల నుంచి హనుమాన్ దేశం వరకూ బోట్లు నడపనున్నట్టు తెలిపింది.

మహారాజశ్రీ విశాఖపట్నం 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No. 247/2022 in O.S.No. 53 / 2022

బిట్వీన్:
వారాడ రాములు & వగైరాలు . . . వాదులు
మరియు:
వారాడ సత్తిరాజు & వగైరాలు ... ప్రతివాదులు
ప్రతివాది:
16వ ప్రతివాది-రెస్పాండెంట్:
గేదెల నాగేశ్వరరావు, తండ్రి లేటు ప్రకాశరావు,
R/o.లాసన్స్ బే కాలనీ, శ్రీలక్ష్మీ నివాస్,
ప్లాట్‌నెంబరు-132,
డోర్ నెంబర్. 4-51-24/4, విశాఖపట్నం.

కోర్టు వారి ఆర్డరు పై తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తమై సమన్లు మీరు చేసుకున్న దస్తావేజు ప్రకారం సదరు అడ్రసుకు నోటీస్‌లు పంపిన అందుకోకుండా ఉన్నందున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా I.A.No. 247/ 2022 in O.S.No. 53/2022 వ్యాజ్యము వాయిదా **తేది: 30-11-2023న** ఉన్నందున, ప్రత్యక్షముగా గాని వకీలు ద్వారా గాని కోర్టునకు హాజరుకాగలరని అలా కానియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని గ్రహించగలరు.

మరుపిళ్ల వెంకటేశ్వరరావు
న్యాయవాది, భీమునిపట్నం
విశాఖపట్నం. విశాఖపట్నం.
తే: 14-10-2023 సెల్: 7981685789

మహారాజశ్రీ విశాఖపట్నం 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S.No. 53 / 2022

బిట్వీన్:
వారాడ రాములు & వగైరాలు . . . వాదులు
మరియు:
వారాడ సత్తిరాజు & వగైరాలు ... ప్రతివాదులు
ప్రతివాది:
16వ ప్రతివాది:
గేదెల నాగేశ్వరరావు,
తండ్రి లేటు ప్రకాశరావు,
R/o.లాసన్స్ బే కాలనీ, శ్రీలక్ష్మీ నివాస్,
ప్లాట్‌నెంబరు-132,
డోర్ నెంబర్. 4-51-24/4, విశాఖపట్నం.

కోర్టు వారి ఆర్డరు పై తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తమై సమన్లు మీరు చేసుకున్న దస్తావేజు ప్రకారం సదరు అడ్రసుకు నోటీస్‌లు పంపిన అందుకోకుండా ఉన్నందున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా O.S.No.53/2022 వ్యాజ్యము వాయిదా **తేది:30-11-2023న** ఉన్నందున, ప్రత్యక్షముగా గాని వకీలు ద్వారా గాని కోర్టునకు హాజరుకాగలరని అలా కానియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని గ్రహించగలరు.

మరుపిళ్ల వెంకటేశ్వరరావు
న్యాయవాది, భీమునిపట్నం
విశాఖపట్నం. విశాఖపట్నం.
తే: 14-10-2023 సెల్: 7981685789

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.No. 33/2022

Between:
Kilani Uma Maheswari,
W/o. Kilani Bhaskara Rao,
aged 38 years, Hindu,
R/o.D.No. 13,Block-A, GF-5,
1st Bus Stop, Vambay Colony,
Madhurawada,
Visakhapatnam-530048
. . . Petitioner
And:
P.Varalakshmi and 10 others
. . . Respondents

PUBLIC NOTICE

The Public is hereby informed to that the above petitioner filed the above I.P. 33/2022 on the file of the Honourable IInd Addl. Senior Civil Judge, at Visakhapatnam. on 09-09-2022 and presently matter stood posted to **30-10-2023** for hearing. So Public is hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **30-10-2023** either in person or through an advocate at 10-30 A.M.

(By the Order of the Hon'ble IInd Addl. Senior Civil Judge's Court at Visakhapatnam.)
KOLLI KHAGESWARA RAO
Advocate & Notary
Flat No. 102, D.No. 7-24/9/2,
Vaishno Vasudha Apartments,
Madhurawada, Visakhapatnma-48.
Cell : 9247393393

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.183/2023

Between :
Sri Surisetty Nooka Raju
...Plaintiff
And:
Sri Alla Satya Rao ... Defendant

SUMMONS

To,
The Defendant :
Sri Alla Satya Rao,
S/o. late Thatha Rao,
Hindu, R/at D.No.1-65/2/2,
Ganesh Nagar,
Chinamushidiwada,
Pendurthi Mandal,
Visakhapatnam District-531173.

Take notice that the above numbered suit O.S.183/2023 which was filed by the plaintiff against to you for specific performance of contract and for other reliefs on the file of the above mentioned Court and the same is posted to **31-10-2023.** You are hereby summoned to appear either in person or through a properly instructed Advocate at **10:30 A.M** on **31-10-2023.** in the above captioned Court failing which you will be set ex-parte and the matter will be decided in yours absence.

(By Order of the Hon'ble Court)
SANAPATI ESWARA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9441595993.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A. 278/2023 in O.S.183/2023

Between :
Sri Surisetty Nooka Raju
...Petitioner / Plaintiff
And:
Sri Alla Satya Rao
...Respondent/Defendant

NOTICE

To, **The Respondent :**
Sri Alla Satya Rao,
S/o. late Thatha Rao, Hindu,
R/at D.No.1-65/2/2,
Ganesh Nagar,
Chinamushidiwada,
Pendurthi Mandal,
Visakhapatnam District-531173.

Take notice that the above numbered I.A.278/2023 in suit O.S.183/2023 which was filed by the plaintiff against to you for specific performance of contract and for other reliefs on the file of the above mentioned Court and the same is posted to **31-10-2023.** You are hereby required to appear either in person or through a properly instructed Advocate at **10:30 A.M** on **31-10-2023.** in the above captioned Court failing which you will be set ex-parte and the matter will be decided in yours absence.

(By Order of the Hon'ble Court)
SANAPATI ESWARA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9441595993.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.517/2014 in O.S.537/2007

Between :
Botta Yatesh ...Petitioner/Plaintiff
And:
Botta Surya Kantham (died)
& others
...Respondents/Defendants

NOTICE

To,
Respondent No.3:
Golagani Arundathi @ Aruna,
Hindu, aged 63 years,
R/at. 20-112-64,
Chetrala Street, Visakhapatnam.

The above named plaintiff/ petitioner filed the above I.A. under Order XXVI Rule 13 of C.P.C against you for appointment of Advocate Commissioner for partition of parties as per terms of decree dt.07-08-2013. Since your Advocate reported no instructions the Hon'ble Court pleased to order notice to you for your appearance. The said I.A. stands posted to **07-11-2023.** You are hereby directed to attend before the above court on the said date with relevant records either yourself in person or through an Advocate duly instructed by you. Failing which the matter will be decided accordingly as per the material available in your absence.

M.K. Sitaramayya Associates
M.S. VENKATESH,
M.K. SRINIVAS
& M. KAUSHIK,
Advocates, Visakhapatnam.

తెగుళ్లతో వరి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలో వరి పంటకు పలు రకాల తెగుళ్ళ సోకుతున్నాయి. తెగుళ్లతో పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో రైతులు ఎక్కువగా వరి, మొక్క జొన్న పంటలు మాత్రమే వేస్తారు. వరికి ఈ ఏడాది ఎక్కువ శాతం తెగుళ్ల సోకడంతో పంట నష్టపోతుందని రైతులు లబోదిబో మంటున్నారు. ఇప్పటికే పలుమార్లు మందును పిచికారి చేసినా పెద్దగా ఫలితం ఉండటంలేదు. దీంతో ఆ వరి దుబ్బులు పట్టుకొని రైతులు వ్యవసాయశాఖాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పంట పరిపక్వానికి వచ్చిన దశలో కూడా తెగుళ్ల ఆశించడం రైతులను ఆర్థికంగా కృంగదీస్తోంది. గ్రామ స్థాయిలో సచివాలయం, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

దోమపోటుతో నష్టం

ఈ ఏడాది ఇంటి కోసం వరి రకం సాంబామసూరిని అర ఎకరంలో వేసుకున్నాను. ప్రస్తుతం పంట పొట్టదశకు వచ్చింది. ఈ సమయంలో దోమ పోటు ఆశించి పంటకు నష్టం చేస్తోంది. ఇప్పటికి మందులకు రూ.5 వేలు ఖర్చు చేశాను. పంట చేతికొస్తుందో, లేదోనని ఆందోళనగా ఉంది.

బోని అప్పలనాయుడు
రైతు

రేకు పురుగు ఆశించింది

ఈ ఏడాది ఎకరన్నర పొలంలో వరి రకం 1121 వేశాను. ఇప్పటికే రెండు సార్లు తెగుళ్ళ ఆశించాయి. మందు పిచికారి చేశాను. మొదటి సారి రేకు పురుగు ఆశించింది. దాని నివారణకు రూ.1100 ఖర్చు చేశాను. ఇదే పంటకు రెండో సారి పాచిపురుగు ఆసించి తీవ్రంగా నష్టం చేసింది. దీని నివారణకు రూ.1200 ఖర్చుచేసి మందు పిచికారి చేశాను.

బోని వెంకటరమణ
రైతు

పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన వంశీధర్

వంశీకి బంగారు పతకం

ప్రజాశక్తి- భీమునిపట్నం : నేపాల్‌లోని పోకరాలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ఎస్‌బికెఎఫ్ 8వ అంతర్జాతీయ పరుగు పందెం పోటీల్లో 400 మీటర్ల హర్డిల్స్‌లో భీమిలి మండలం, అమనాం గ్రామానికి చెందిన ఎ.వంశీధర్‌కు బంగారు పతకం లభించింది. 110 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకం, 400 మీటర్ల సాధారణ పరుగులో కాంస్య పతకం లభించాయి. ఇప్పటి వరకు సుమారు 200కు పైగా వివిధ పతకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇతను ప్రస్తుతం మండల విద్యా శాఖలో కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఇతను పొందిన మరికొన్ని పతకాల్లో జాతీయ రత్న హై రేంజ్ బుక్ ఆఫ్ అవార్డు, యుకె అవార్డు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ అవార్డు ఉన్నట్లు ఆయన వివరించారు. త్వరలో ఎవరెస్ట్ శిఖరం ఎక్కనున్నట్లు తెలిపారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 16న విశాఖలో పర్యటన సందర్భంగా ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని జివిఎంసి కమిషనర్ సిఎమ్. సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సందర్శించి పరిశీలించారు. మధురవాడ ఐటి సెజ్ హిల్ 3లో ఏర్పాటుచేసిన హెలిపాడ్ పరిసరాలను, ఆ సమీపంలోనే జివిఎంసి బీచ్ క్లీనింగ్ మిషన్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సంబంధిత ఏర్పాట్ల వివరాలపై కమిషనర్ సాయికాంత్‌వర్మతో మేయర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, రెండవ జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, ప్రధాన వైద్యాధికారి బి.నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ సునీత, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజు, ఎఎంఒహెచ్ డాక్టర్ కిషోర్, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాస్, ఇన్ఫోసిస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హెడ్ అమూల్ కులకర్ణి పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి-వేపగుంట : 52వ వార్డు సమీపంలోని ప్రమధ ఉమా విశ్వేశ్వర కుమారస్వామిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేపగుంట కళ్యాణ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యత

గీతం వర్క్‌షాపులో వక్తలు

వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు ప్రతి రంగంలోనూ పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యత పెరుగుతోందని, ఈ నేపథ్యంలో భవిష్యత్తులో గ్రీన్ జాబ్స్, హరిత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం జరిగిన వర్క్ షాప్‌లో నిపుణులు అభిప్రాయాలు వెల్లడించారు. వర్క్ షాప్‌ను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిఎస్.కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న పర్యావరణ సమస్యల కారణంగా పరిశ్రమలు, ఔషధ రంగం, వ్యవసాయ రంగం హరిత సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి సారిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఈ మార్పు భవిష్యత్తులో పర్యావరణ నిపుణులకు విస్తృత ఉపాధి మార్గాలతో పాటు స్వయంగా పరిశ్రమల స్థాపించే అవకాశాలను కల్పిస్తోందని అభిప్రాయపడ్డారు.

గీతం పర్యావరణ శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రీన్ టెక్నాలజీ స్టార్టప్‌లు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సర్క్యులర్ ఎకానమీ, సహజ వనరుల నిర్వహణ వంటివి నూతన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. పట్టణ వ్యవసాయం, మిద్దె పంటలు కొత్త తరం వ్యవసాయ నిపుణులను ఆర్థికంగా ఆకర్షిస్తున్నాయని తెలిపారు. పర్యావరణ శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్ కుమార్ వాయు కాలుష్యం పెరగడానికి గల కారణాలను విశ్లేషించారు. దేశంలో నీటి కాలుష్య తీవ్రతపై ప్రసంగించిన పర్యావరణ శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.కిరణ్మయి రెడ్డి 21 శాతం వ్యాధులకు నీటి నాణ్యతాలోపాలే కారణమన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ అనిమా సునీల్ దధిచ్, పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ సరిత, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ విడిఎన్.కుమార్ అబ్బరాజు తదితరులు ప్రసంగించారు.

కొనసాగుతున్న బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : అఖిల భారతి శిక్షా సంస్థాన్ ఆధ్వర్యాన 34వ జాతీయ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ అండర్ 14 బాలికల పోటీలు రెండవ రోజు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి కిషోర్‌కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీల్లో రాజస్థాన్, మధ్య క్షేత్ర మధ్య జరిగిన పోటీల్లో రాజస్థాన్ విజయం సాధించగా, దక్షిణ మధ్య క్షేత్ర, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన పోటీల్లో దక్షిణ మధ్య క్షేత్ర విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఆరిలోవ సిఐ సోమశేఖర్, విడిబిఎ చైర్మన్ టిఎస్ఆర్ ప్రసాద్, విడిబిఎ అధ్యక్షులు మహంతి, విడిబిఎ ఉపాధ్యక్షులు హనుమంతురావు, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైసిపి నాయకులు జగ్గుపిల్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

రైతులతో మాట్లాడుతున్న రీ సర్వే బృందం సభ్యులు

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం చందక పంచాయతీ జగ్గరాజుపాలెం గ్రామంలో శనివారం దక్షిణ భారతదేశ భూ సర్వే బృందం పర్యటించింది. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో బృంద సభ్యులు మాట్లాడారు. భూ సర్వే వల్ల ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులనడిగి తెలుసుకున్నారు. దేశంలో మొదటిసారిగా రీ సర్వే ఆంధ్రాలో ప్రారంభించినట్లు తెలిపారు. మిగతా రాష్ట్రాల్లో నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆనందపురం మండలంలో 26 పంచాయతీలకుగానూ 16 పంచాయతీల్లో రిసర్వే పూర్తయిందని తహశీల్దార్ లోకవరపు రామారావు బృంద సభ్యులకు వివరించారు. సర్వేకు సాటిలైట్ సిగ్నల్ 5 పాయింట్లు కావాల్సి ఉండగా మండలంలో 32 పాయింట్లు వరకు సిగ్నల్ ఉండడంతో సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర, సెంట్రల్ టీమ్ సుమారు 37 మంది ఐఎఎస్ అధికారులు పాల్గొన్నారు. స్థానిక అధికారులైన భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, వీఆర్‌ఒలు, పలువురు అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

మృతుని వివరాలు లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తగరపువలస గోస్తనీ శ్మశాన వాటిక వద్ద శుక్రవారం పడి ఉన్న గుర్తు తెలియని మృతుని వివరాలు లభించాయి. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పాన్ కార్డు ఆధారంగా అతన్ని దువ్వి పైడిరాజుగా గుర్తించారు. ఇతను బైక్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. మతుని భార్య సమత శనివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుల బాధ తాళలేక మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పలుచోట్ల గడపగడపకు..

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : మండలంలోని తర్లువాడ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మంచి నీటి కుళాయిలు, విద్యుత్ స్తంభాలు, సైడ్ కాలువలు, శ్మశాన వాటికకు రోడ్డు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ముత్తంశెట్టి సానుకూలంగా స్పందించి 45 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడప లవరాజు, కరుణాకర్, సర్పంచ్ డిఆర్‌బి.నాయుడు, మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, మజ్జి రమేష్‌నాయుడు, ఇల్లాపు వెంకటజగన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి రాజీవ్ నగర్, వెటర్నరీకాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు వైసిపి ఇన్‌ఛార్జి జగ్గుపిల్ల అప్పలరాజుతో కలిసి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పారావు, కృపాజ్యోతి, కనకల కృష్ణ, ప్రసాద్, కె.మోహన్‌రావు, బొడ్డు అప్పలనాయుడు, ఒమ్మి శ్రీను, పతివాడ కనకరాజు, బోండా శ్రీను, చొక్కర శేఖర్, రాజబాబు పాల్గొన్నారు.

కాలువలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి కాలువలో జారిపడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఎకెసి కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో పెంటకోట వరలక్ష్మి నివాసముంటుంది. నేవల్ పార్కులో కూలి పనిచేస్తోంది. వరలక్ష్మికి నాలుగేళ్ల బాలుడు లకేష్ ఉన్నాడు. శనివారం బాలుడు లకేష్ అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో జివిఎంసి పెద్ద కాలువలో పడిపోయాడు. అదే సమయంలో జివిఎంసి వాటర్ ట్యాంక్ నిండిపోయి కాలువలో ప్రవహిస్తున్న సమయంలో పడి సిమెంట్ దిమ్మలకు కిందకు వెళ్లిపోవడంతో మృతి చెందాడు. స్థానికులు గమనించి తల్లి వరలక్ష్మికి, పోలీసులకు సమాచారమందించారు. మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. బాలుడు మృత దేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ట్రూ అఫ్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన శనివారం స్థానిక జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, మాజీ కౌన్సిలర్లు టి.సోమరాజు, చిల్ల నరసింహులు, నాయకులు కె.రాంబాబు, ఎం.అప్పలరాజు, ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్‌కె బీచ్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ వైసిపి పాలనలో విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఇలాగే ముందుకెళ్తే రానున్న కాలంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మథరావు, క్షేత్రపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భరతనాట్యం, కోలాటం, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 53వ వార్డు పరిధి శివనగర్‌లో కెకెఆర్.ఈశ్వర్ అసోసియేషన్ ఆధ్వర్యాన భరతనాట్యం, కోలాటం, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తరగతుల శిబిరాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేసి, మహిళలను ప్రోత్సహిస్తున్న అసోసియేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ సదరం జ్ఞానేష్‌ను అభినందించారు. బర్కత్ అలీ మాట్లాడుతూ, ఈ శిబిరం ద్వారా అనేక మంది ఈ కోర్సులను నేర్చుకొని, భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. జ్ఞానేష్ మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గం అంతటా ఈ శిబిరాలను త్వరలోనే విస్తరిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలకు అధ్యక్షులుగా పెద్దాడ జోత్స్న, సెక్రెటరీగా కాళ్ళ ప్రియాంకను నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుజ్జు వెంకటరెడ్డి, పైడి కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

జెసిఎస్-3 మండల సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం పరిధి అక్కయ్యపాలెం షాధిఖాన కల్యాణ మండపంలో జెసిఎస్ మండలం-3 (45,46,47,55 వార్డులకు) సంబంధించి సమీక్షా సమావేశం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటిని ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని తెలిపారు. కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి ఉత్తర నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగిరేలా కృషిచేయాలని కోరారు. చంద్రబాబును అన్యాయంగా కేసులో ఇరికించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయన రూ.కోట్లు కాజేసిన వైనాన్ని ప్రజలకు వివరించి వారి ఆరోపణలను తిప్పికొట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, 55వ వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మచక్రం మహోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార: బుల్లయ్య కాలేజీ దగ్గర అంబేద్కర్ భవన్‌లో శనివారం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, బౌద్ధ సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యాన 67వ ధర్మచక్రం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుద్ధుడు, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో గల బుద్ధ విహార్‌లో 23 మంది బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా బౌద్ధ సాహిత్య రచయిత బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ, స్వేచ్ఛ, సమానత్వాలకు ప్రతీకగా బౌద్ధ ధమ్మం విరాజిల్లుతుందన్నారు. భారతదేశంలో అన్ని రకాల అసమానతలు, కుల వ్యవస్థను వ్యతిరేకిస్తున్న ఏకైక మతం బౌద్ధమని పేర్కొన్నారు. అందుకే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాగపూర్‌లో ఐదు లక్షల మందితో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని తెలిపారు. ప్రొఫెసర్ పిడి.సత్యపాల్ మాట్లాడుతూ, దక్షిణ కళింగ ప్రాంతంలో భాగమైన విశాఖపట్నం తీరంలోని 15 కిలోమీటర్ల పరిధిలో తొట్లకొండ, బావికొండ, బొజ్జన్నకొండ, పావురాల కొండ లాంటి అనేక బౌద్ధఆరామాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ మాటూరు శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఇంటి గురుమూర్తి, ఎం.మల్లయ్యరాజు, హరిబాబు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి-సీతమ్మధార : దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలకు హాజరు కావాలని మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకట రెడ్డికి పలువురు శనివారం ఆహ్వానించారు. సీతమ్మధారలోని ఆయన కార్యాలయానికి 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, రేసపువానిపాలెం భులోకమాత దేవి నవాత్రులు గ్రామ కమిటీ సభ్యులు, శాంతి స్వరూపిణి దుర్గాదేవి శరన్నవరాత్రులు ఆలయ కమిటీ సభ్యులు, గాంధీ నగర్ వద్ద దేవి నవరాత్రులు లక్కీ యూత్ అసోసియేషన్ సభ్యులు, 24వ వార్డు గ్రామస్తులు వచ్చి కాయల వెంకటరెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సాడి కేశవరెడ్డి, కర్రి మురళీకృష్ణారెడ్డి, మజ్జి ఉమామహేశ్వరరెడ్డి, బేరి గురునాథ్‌రెడ్డి, బాచి, రేసపు జగదీష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గుప్తా, ప్రసాద్, రాజేష్, ట్రావెల్స్ రెడ్డి పాల్గొన్నారు.

హక్కులు, ప్రభుత్వ రంగ రక్షణ కోసం ఉద్యమించాలి

గొడౌన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ : కార్మికులు తమ వేతన ఒప్పందాల హక్కుల సాధనతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు ఉద్యమించాలని గొడౌన్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు మరడాన జగ్గునాయుడు పిలుపునిచ్చారు. నేవల్ డాక్ యార్డ్ సమీపంలోని ధనరెడ్డి అండ్ కంపెనీ, గంగిరెడ్డి షిప్పింగ్ సంస్థల్లో పనిచేస్తున్న 624 మంది కార్మికులకు వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా గొడౌన్ వద్ద యూనియన్ అధ్యక్షులు పూడి పైడిరాజు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, సిఐటియు నాయకత్వంలో ఐక్యంగా నిలిచి నూతన వేతన ఒప్పందం చేసుకున్నందుకు కార్మికులకు, సహకరించిన యాజమాన్యాలకు అభినందనలు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు, చట్టాలు కాలరాస్తున్న నేపథ్యంలో కార్మికులు సంఘటితంగా ఉద్యమించి తమ హక్కుల సాధనకు పూనుకోవాలన్నారు. కార్మికులు వేతన ఒప్పందాలతో పాటు విశాఖపట్నం పోర్టు, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి గొడౌన్స్ కార్మికులు తమ వంతు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇతర కార్మికులతో కలిపి ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖపట్నం పోర్టును బలహీనపరుస్తోందని, బెర్త్‌లను ప్రైవేటుకు కట్టబెడుతోందని విమర్శించారు. భూములను సైతం లీజు పేరుతో సంపన్నులకు కట్టబెడుతోందని తెలిపారు. కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు యంత్రాలను వినియోగించి కార్మికుల ఉపాధికి గండి కొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలకు, విశాఖపట్నానికి, కార్మికులకు, యువతకు తీవ్ర హాని చేస్తుంటే దీనిని నిలువరించాల్సిన వైసిపి, టిడిపి, జనసేన తమలో తాము కలహించుకొని ప్రజలకు ద్రోహం చేస్తున్న బిజెపికి ఒత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. ఈ పార్టీలు బిజెపి కబంధహస్తాల నుంచి బయటకు వచ్చి ప్రజల ప్రయోజనాలకు అండగా నిలవాలని, లేకుంటే బిజెపితో పాటు ఈ పార్టీలకు కార్మికులు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్మిక ఉద్యమ అవసరాలకు కార్మికులు ఆర్థికంగా అండగా నిలవాలన్న విజ్ఞప్తికి కార్మికులు సానుకూలంగా స్పందించారు.

నూతన వేతన ఒప్పందం ప్రకారం 50 కేజీల బస్తా పట్టుబడికి రూ.5, ఒక లారీ లోడింగ్‌కు (200 బస్తాలు) రూ.691, ఒక బేల్‌కు రూ.18, సంక్రాంతికి ప్రతి కార్మికునికీ రెండు కంపెనీలు రూ.1500 చొప్పున దుస్తుల అలవెన్స్, ఈ వేతన ఒప్పందం 2023 ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి వస్తుందని జగ్గునాయుడు తెలిపారు. ఈ సభలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవుడునాయుడు, ఆఫీస్ బేరర్లు సన్యాసిరావు, వెంకటరావు, పాత్రుడు, శ్రీనివాసరావు, నాయుడు, మేస్త్రీలు ,కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆల్ సైడింగ్స్ వేతన ఒప్పందం చేయకుంటే ఆందోళన

కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు గల పోర్టు ఏరియా రైల్వే ఆల్ సైడింగ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల నూతన వేతన ఒప్పందం వెంటనే చేయకుంటే ఆఫీసుల ముందు ఆందోళన చేయక తప్పదని ఆల్ సైడింగ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పూడి పైడిరాజు హెచ్చరించారు. వేతన ఒప్పంద కాలం పూర్తయి, కార్మికులు కోర్కెల పత్రం ఇచ్చి నెలలు గడుస్తున్నా కొన్ని యాజమాన్యాలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఆల్ సైడింగ్స్ యాజమాన్యాల అసోసియేషన్ వెంటనే స్పందించి చర్చలు ప్రారంభించి వెంటనే అగ్రిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులు ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు.

శరవేగంగా కణితి రోడ్డు విస్తరణ

100 అడుగుల మేర విస్తరణకు అడ్డుగా ఉన్న భవనాల తొలగింపు

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గాజువాక కణితి రోడ్డు విస్తరణ పనులు వారం రోజులుగా శరవేగంగా జరుగుతున్నాయి. 100 అడుగుల విస్తరణతో వెడల్పు చేయనున్నారు. ముందుగా షాపులందరికీ నోటీసులు ఇచ్చారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న షాపులన్నీ తొలగించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని ఈ రోడ్డు విస్తరించాలని గతంలో అనేకసార్లు అధికారులు ప్రతిపాదించడం, వెనక్కి రావడం పరిపాటిగా మారింది. ఈసారి మాత్రం వెనకడుగు వేయకుండా ముందుకు సాగారు. ఈ రోడ్డు విస్తరణ జరిగితే గాజువాక ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరనుంది. కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి దువ్వాడ వరకు రోడ్డు విస్తరణ చేయనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం రోడ్ మ్యాపింగ్ కూడా చేశారు. ఆదివారం నుంచి షాపులు తొలగించే కార్యక్రమం చేపట్టనున్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి -గాజువాక : కండిపిల్లి వీధిలో విజయదుర్గమ్మ ఆలయం వార్షికోత్సవ సందర్భంగా అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్, హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి, అండిబోయిన అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమ్మవారిని తొమ్మిది రోజులు అలంకరించి ఘనంగా పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లావణ్య, శివప్రసాద్, రాము, ఆలయ ధర్మకర్తలు తెప్పలు, దుర్యోధన, లక్ష్మి, వాసిశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నిపిల్లి తమ్మారెడ్డి, పాతూజు త్రినాధరావు, కండిపిల్లి సత్యనారాయణ, మణికంఠ, పాల్గొన్నారు.

16న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పెందుర్తి : వేపగుంటలో ఈ నెల 16న ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ ఆధ్వర్యాన మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నటుల నేషనల్ ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ చైర్మన్ తెలిపారు. నలుగురు వైద్య సిబ్బందిచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కూడా అందజేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోపరుచుకోవాలని కోరారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ వార్డు అధ్యక్షులు ముక్కా కిశోర్ ఆధ్వర్యాన ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు వందమందికి గీతం దంత వైద్యశాల వైద్యులు పరీక్షించారు. అవసరమైన వారికి గీతంలో మరిన్ని పరీక్షలు చేయనున్నట్లు కిశోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్ బోను, డాక్టర్ నమ్రత పాల్గొన్నారు.

'ఉక్కు' అమరుడు అమృతరావుకు నివాళి

అమృతరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమ సత్యాగ్రహి టి.అమతరావు ఉద్యమం చేపట్టి 54 ఏళ్ళు అయిన సందర్భంగా వైఎస్‌ఆర్‌టియుసి స్టీల్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప ఆధ్వర్యాన ప్లాంట్‌లోని అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు గుంటూరు నుంచి విశాఖ వచ్చి నిరవధిక నిరాహారదీక్షకు దిగారని గుర్తుచేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానీవ్వమని, రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని నడపటానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. అమృతరావు పోరాట ఫలితంగా ఏర్పడిన ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో మాటూరి శ్రీనివాసరావు, పట్టా రామఅప్పారావు, వైటి.దాసు, నీరుకొండ రామచంద్రరావు, కర్రి దాలినాయుడు, గొందేశి అప్పలరెడ్డి, బి.అప్పారావు, కారు రమణ, డేవిడ్, ఎన్నేటి రమణ, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, బోర శశిభూషణరావు, బి.సాయి, దామురోతు అప్పలరాజు, దరిగి రవి, బిఎన్.రాజు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉక్కునగరం, ఆరిలోవ : జివిఎంసి 87వ వార్డులోని పలు ప్రాంతల్లో రూ.2 కోట్లా, 48 లక్షలా 43 వేలతో పలు అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఏకలవ్యవీధిలో రూ.19.70 లక్షలతో ఆర్‌సిసి బాక్స్ కల్వర్ట్‌లకు, ముస్లిం వీధి మసీదు రోడ్డు పక్కన రూ.19.90 లక్షలతో సిసి డ్రెయిన్‌లు, కణితి-తెలుకుల వీధిలో రూ.18.90 లక్షలు ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాల్ పనులకు, కణితి-గవర వీధి సిడబ్ల్యుసి - గవర వీధి రామాలయం రోడ్డుకు రూ.19.98 లక్షలతో ఎస్‌డబ్ల్యు డ్రెయిన్లు, గవర వీధి రామాలయం అవతలి వైపు రోడ్డును రూ.19.95 లక్షలతో ఎస్‌డబ్ల్యు డ్రెయిన్లకు, పవన్ సాయి హాస్పిటల్ నుంచి హైవే వరకు పార్ట్ -1 రూ.79.43 లక్షల వ్యయంతో, పార్ట్ -2 రూ.70.57 లక్షలతో విఆర్‌సిసి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, సచివాలయం కన్వీనర్లు కోమటి రమాదేవి, బలిరెడ్డి నాగేశ్వరావు, ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, జెర్రిపోతుల ఈశ్వరావు,ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో జివిఎంసి నిధులు రూ.49 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్ ఆధ్వర్యాన మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీ ఎంవివి సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్, ఎంపీ మాట్లాడుతూ, విశాఖ సుందరీకరణలో భాగంగా ప్రతి వార్డులో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మారిశెట్టి నాగేశ్వరరావు, లక్ష్మీకళ, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల కార్మికులకు రక్షణ కల్పించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి, చిత్రంలో శంకర్, శ్రీను, రమణ

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఫార్మాసిటీలో భద్రతా ప్రమాణాల పాటించాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరవాడ ఫార్మాసిటీకి విచ్చేస్తున్న సందర్భంగా శనివారం పరవాడలో జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పలు సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలు జీవో సవరించాలని, ఫార్మా నిర్వాసితులకు, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని, కాలుష్య కోరల్లో అల్లాడుతున్న తాడి గ్రామాన్ని తరలించాలని, ముత్యాలంపాలెం మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని కోరారు. రాంకీ యాజమాన్యం చెరువులు, కాలవలు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని కాలుష్యం చేస్తుందని, దానిని అరికట్టాలని కోరారు. పరవాడ ప్రాంతంలో బొగ్గు లారీల కాలుష్యంపై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా నాయకులు వివి.రమణ పాల్గొన్నారు.

సెజ్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

అచ్యుతాపురం : ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా అచ్యుతాపురం సెజ్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రకటన చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గతంలో పాదయాత్ర సందర్భంగా బ్రాండిక్స్‌లో కార్మికులకు కటింగ్‌లు పోయి నెలకు రూ.10వేలకు పెంచుతామన్న హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. 15 సంవత్సరాల క్రితం ఉన్న కనీస వేతనాల జీవో ఇప్పటికీ బ్రాండిక్స్ ఎస్ఈజెడ్ ,ఫార్మా పరిశ్రమలు అమలు చేస్తున్నాయని, కార్మికులకు అతి తక్కువ జీతాలు ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. బ్రాండిక్స్ సీడ్స్ కంపెనీ ప్రమాద బాధిత మహిళలకు మూడు నెలల్లో లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఎన్‌జిటి ఇచ్చిన తీర్పు నేటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. పరిశ్రమల మధ్యలో తీవ్ర కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న చినపూడి, దుప్పుతూరు, చిన తల్లదిబ్బ గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. వీటితో పాటు పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సోమునాయుడు, జి.దేముడు నాయుడు, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

వైద్యులకు అభద్రతాభావం కలగకుండా చూడాలి

ప్రజాశక్తి-చోడవరం

వైద్యులకు అభద్రతాభావం కలగకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం చోడవరంలో జరిగిన వైద్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యుల రక్షణ కోసం 2008లో నాటి ప్రభుత్వం చట్టం రూపొందించిందని, దానికి అనుగుణంగా నిర్లక్ష్యం కేసులు నమోదు చేసే ముందు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ముగ్గురు వ్యక్తుల కమిటీ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలని కోరారు. ప్రస్తుతం ప్రాథమిక ఆధారాలు పరిశీలించకుండా కేసులు నమోదు చేయడం వల్ల వైద్యుల్లో అభద్రతాభావం పెరుగుతుందన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని 50 పడకల ఆసుపత్రి నుండి 20 పడకల ఆసుపత్రులకు వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి తాము కూడా అనేక చోట్ల హాజరవుతున్నామని తెలిపారు. వైద్య రంగాల్లో అనేక మార్పులు వచ్చాయని, వాటిని ప్రజలకు అందించేందుకు వైద్యులు అనునిత్యం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ జై చంద్రనాయుడు, చోడవరం శాఖ అధ్యక్ష కార్యదర్శులు రాజాన అప్పలనాయుడు, బండారు సత్యనారాయణ, కోశాధికారి బంగారు కృష్ణ, ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ఎంవిఆర్ తనయుడు సతీష్

దుర్గాదేవి విగ్రహానికి ఎంవిఆర్ విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : మునగపాక మండలం తిమ్మరాజుపేటలో దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి అమ్మవారి విగ్రహానికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ అనకాపల్లిలోని నర్సింగరావుపేట ఎంవీఆర్ కార్యాలయంలో శనివారం విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజు టీం సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైసిపి ముఖ్య కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండలం తారువ గ్రామంలోని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు క్యాంపు కార్యాలయంలో వైసీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వైసిపి అన్ని విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పరవాడ

ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే, కలెక్టర్, జెసి, ఎస్‌పి తదితరులు

పరవాడ మండలం జెఎన్ ఫార్మాసిటీలో యుజయా కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 16న విచేస్తున్న సందర్భంగా యుజయా కంపెనీ గ్రౌండ్‌లో హెలీపాడ్, ప్రారంభోత్సవ వేదిక ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అనకాపల్లి ఆర్డీఓ చిన్న కృష్ణ, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర సిఐసి సభ్యులు పైల శ్రీనివాసరావు, నాయకులు కోన రామారావు, చుక్క రాము నాయుడు, తహసీల్దార్ కనకరావు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కక్ష సాధింపుతోనే చంద్రబాబుకు అనారోగ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు

ప్రభుత్వ కక్షసాధింపులు, జైలు అధికారులు చంద్రబాబుకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్లే ఆయన ఆరోగ్యం ప్రమాదకరంగా మారిందని తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 73 ఏళ్లున్న వ్యక్తి చుట్టూ అపరిశుభ్ర వాతావరణం కల్పించి, ప్రభుత్వమే కావాలని ఆయన్ని ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే చంద్రబాబు వ్యక్తిగత వైద్యుల్ని జైల్లోకి అనుమతించి, వారితో ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన్ను కేంద్రప్రభుత్వ వైద్య సంస్థకు తరలించి మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని కోరారు. చంద్రబాబు ఆరోగ్యంపై రాష్ట్ర గవర్నర్ స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకం

నక్కపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శివయ్య

ప్రజాశక్తి- అనకాపల్లి

విద్యాసంస్థల అభివృద్ధిలో ఆ సంస్థలో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థులు ముఖ్య భూమిక పోషించాల్సిన అవసరం ఉందని నాక్ అక్రిడిషన్ మెంటార్, నక్కపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివయ్య పేర్కొన్నారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. పూర్వ విద్యార్థులు తమ మేధోశక్తిని, వారికున్న అవకాశాలను, ఆర్థిక సహకారాన్ని స్వచ్ఛందంగా అందజేయాలన్నారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతానికి చెందిన బెల్లం వర్తకులు స్వాతంత్ర్యం రాకముందే విద్యా, వైద్య సంస్థలు ప్రారంభించి ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించారని, వారి స్ఫూర్తిని నేటికీ కొనసాగిస్తున్నామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ఉన్న ప్రస్తుత పోటీని తట్టుకొని కళాశాలను నిర్వహిస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు మాట్లాడుతూ నాక్ అక్రిడేషన్ నిబంధనలన్నీ తూచా తప్పకుండా పాటిస్తూ, కళాశాలకు ఏ ప్లస్ గ్రేడింగ్ వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రమేష్, బాలకృష్ణ, సకల గోవింద, వై జగదీశ్వరరావు, కెఎన్ఎస్ శర్మ, పివి.సత్యనారాయణ జోసెఫ్, కర్రి జోగినాయుడు, సింగంశెట్టి వాసు నాయుడు, బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శివయ్యను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నేతలు

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

ముదిరిపోయిన వరి నారు మళ్లును పరిశీలించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, నాయకులు జి.నాయనబాబు, మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. మండలంలోని రైవాడ గ్రామంలో నీరు లేక వరి నాట్లు పడక, ముదిరిపోయిన వరి నారు మళ్లను శనివారం సిపిఎం నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైవాడ ప్రాజెక్టు కోసం వందలాది ఎకరాల భూములు, ఇల్లులు త్యాగాలు చేసిన రైతులకు సాగునీరును అందించకపోవడం దుర్మార్గమన్నారు. తమ ప్రభుత్వం వస్తే ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందిస్తామని చెప్పిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాటల్లో డొల్లతనం బయట

ముదిరిపోయిన వరి నారును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పడిందన్నారు. రిజర్వాయర్ పక్కనే ఉన్నా రైతులు వరినాట్లు వేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని, ఎండిన పొలాలను పశువులకు మేపేస్తున్న దృశ్యాలు కట్టతడి పెట్టించాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని 12 మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని, వెంటనే అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రుణాలు మాఫీ చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైవాడ ప్రాజెక్టును పాలకులు పూర్తిగా విస్మరించారని, వైసిపి ప్రభుత్వం దీనికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గతంలో రైవాడ ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరు ఇస్తే, ఇప్పుడు ఒక్క పంటకే ఇస్తున్నారని, భవిష్యత్తులో అది కూడా గ్యారెంటీ లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి రైవాడ రైతులకు ఎత్తు పోతల పథకం ద్వారా సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సత్కరించిన దృశ్యం

వ్యవసాయాధికారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గం శనివారం ఎన్నికైంది. సంఘం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కమలాకర్ శర్మ, అధ్యక్షులు బాల భాస్కర్, కోశాధికారి డాక్టర్ మురళీ కిషోర్, ఉపాధ్యక్షులు డాక్టర్ బి.విజయ ప్రసాద్ ఆధ్వర్యాన సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ వి.రవీంద్రనాథ్, కార్యదర్శిగా డాక్టర్ పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టి.శ్రీదేవి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె.ఉమా ప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ పి.విజేతను ఎన్నికోవడం జరిగింది. అనంతరం కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం విశాఖ జిల్లా నాయకులు డాక్టర్ టి.దాసు, కార్యదర్శి నవీన్ జ్ఞానమణి, కె.శ్యామల, అనకాపల్లి జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నాయకులు కెవి.సత్యనారాయణ, కిరణ్, మళ్ల శ్రీనివాస్, సంజీవరావు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి : దసరా సెలవుల్లో విద్యా సంస్థలు తెరిస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దసరా సెలవుల్లో అన్ని యాజమాన్యాల పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవడానికి వీలులేదని, పిల్లలకు వర్క్ షాపులు, సిలబస్ పూర్తి కాలేదని, పదో తరగతి ప్రత్యేక తరగతులు వంటివి నిర్వహిస్తున్నట్లు తమ కమిషన్ దృష్టికొస్తే అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయడమే, కాకుండా క్రిమినల్ చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరికీ ప్రత్యేక మినహాయింపులు లేవని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా ఫిర్యాదులను ఎంఇఒ, డిఇఒ దృష్టికి తీసుకురావాలని కోరారు. లేదంటే 1098 చైల్డ్ లైన్‌కు, 1092 కాల్ సెంటర్‌తో పాటు secy.se.edn@gmail.com, apscpcr2018@gmail.com లకు ఫిర్యాదులు అందించాలని సీతారాం సూచించారు.

16న కలెక్టరేట్ స్పందన రద్దు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 16న సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పర్యటనలో పాల్గొంటున్నందున ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం 16వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో ఉండదని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం నీలకంఠాపురం గ్రామంలోని పడాల వారి కల్లాల వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును జెడ్పిటిసి దొండా రాంబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పిటిసి నిధులనుండి ప్రజలను తాగునీటి అవసరాల కోసం మంచినీటి బోరు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పడాల నాగభూషణం, విజయరామరాజుపేట సర్పంచ్ ఎల్లపు విజయ్ కుమార్, పోలేపల్లి సర్పంచ్ సీతా బుజ్జి, పలువు రైతులు పాల్గొన్నారు.

బోరు బావిని ప్రారంభిస్తున్న జెడ్పిటిసి రాంబాబు

దర్జాగా ఇసుక అక్రమ రవాణా

- వినియోగదారుల జేబుల గుల్ల
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలిలో నిర్మాణదారుల కళ్లలో ఇసుక జల్లి వారి జేబులు గుల్ల చేస్తున్న వైనం పబ్లిక్‌గా జరుగుతోంది. పట్టణ నడిబొడ్డున మెయిన్‌రోడ్డు గుండా నిత్యం బిల్లుల్లేకుండానే ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అయినా పట్టించుకున్న నాథులే కరువయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైపెచ్చు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అన్ని రసీదులూ ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు. దొంగ బిల్లుల వ్యవహారమూ హల్ చల్ చేస్తోంది. అక్రమార్కులకు

అనధికారికంగా నిల్వ చేసిన ఇసుకను తరలిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

చోటా, మోటా రాజకీయ నాయకుల అండదండలున్నట్లు వారే పబ్లిక్‌గా చెబుతున్నారు. వెరసి తప్పుడు వ్యాపారంతో ప్రభుత్వానికి నష్టం కలిగిస్తూ, దళారులు లక్షల రూపాయలు దండుకుంటున్నారు. స్థానిక ఇసుక వినియోగదారులు తమకు ఎదురౌతున్న ఇబ్బందులు కక్కలేక, మింగలేకపోతున్నారు.

సరైన ఇసుక పాలసీ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక లభ్యత స్థానికంగా లేకపోవడంతో కొంతకాలం రీచ్‌ల నుంచి తెచ్చుకునే వారు. ఇప్పుడదీ లేకపోవడంతో ప్రభుత్వ స్టాక్ యార్డుల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. చిన్న చిన్న రిపేర్లు, పాక్షికంగా నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవగాహన లేక ఎక్కువ మంది దళారుల దగ్గరే ఇసుక కొనుక్కుంటున్నారు. ఇళ్ల నిర్మాణదారులు సైతం ఆన్‌లైన్ పాట్లు పడలేక స్టాకుయార్డులకు వెళ్లకుండానే అడ్డదారుల్లో ఇసుక రప్పించుకుంటున్నారు. ఇదే అదునుగా ఇసుక దళారులు రెచ్చిపోతున్నారు. వారు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగిపోతుంది. బల్క్‌గా ఇసుక రప్పించుకొని స్టాక్‌పాయింట్ల దగ్గర చాటుగా దించుకొని, అవసరమైన వారికిళ్లకు దర్జాగా ట్రాక్టర్లలో సరఫరా చేస్తున్నారు. ఎవరైనా మధ్యలో ఆపి రశీదులు అడిగితే రోడ్డు, దారిలేక లోడు ఫలానా చోట ఆపారని, అక్కడ నుండి వారి నిర్మాణం జరిగే స్థలానికి ఇసుక తోలుతున్నామని బుకాయిస్తున్నారు. ఇదే కథ పట్టుకున్న అధికారులకు ఏడాదంతా చెబుతున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ప్రస్తుతం ఇసుక ఆన్‌లైన్‌లో టన్ను రూ.450కు దొరుకుతోంది. దానిని ఇక్కడ రూ.1,100 నుంచి రూ.1,500 వరకూ అమ్ముతున్నారు. 30 టన్నుల లారీ లోడ్ కావాలంటే రూ.30,000 నుంచి రూ.40,000 పలుకుతోంది. స్థానికంగా 5టన్నుల ఇసుక ట్రాక్టర్‌లోడ్ రూ.5,000కు వస్తుండగా దానిని రూ.7,500కు సరఫరా చేస్తున్నారు.

ఫిర్యాదులొస్తే దాడులు చేస్తాం

వెహికల్ వెళ్లలేని నిర్మాణాలకు ఇతర వాహనాల్లో ఇసుక సరఫరా చేయవచ్చు. కానీ బిల్లు తప్పనిసరి. ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా నేరం. అటువంటి దళారులపై దృష్టి సారించాం. ఫిర్యాదులొస్తే దాడులు చేస్తాం. పట్టుబడ్డ వారికి రూ.10వేల వరకూ జరిమానా విధిస్తాం.

- జనార్దన్, యలమంచిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్

సెజ్, ఫార్మా కార్మికులకు

బోనస్ చెల్లించాలని సిఐటియు ప్రచారం

కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఈజెడ్, ఫార్మా పరిశ్రమల కార్మికులందరికీ 20 శాతం దసరా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకులు శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ఈ నెల జీతంతో కలిపి బోనస్ ఇవ్వాల్సి ఉండగా, దసరా దగ్గర పడుతున్నా ఇప్పటివరకు పరిశ్రమల యాజమాన్యాలు బోనస్ ప్రకటించలేదన్నారు. పేమెంట్ ఆఫ్ బోనస్ యాక్ట్ ప్రకారం బోనస్ కోసం కార్మికుని జీతంలో ప్రతి నెలా కొంత భాగాన్ని యాజమాన్యాలు వేరుగా నిల్వచేసి ఏడాదికోసారి చెల్లిస్తారని, అందుకే బోనస్‌ను బకాయి పడ్డ వేతనం అంటారని తెలిపారు. పర్మినెంట్, కాంట్రాక్టు, హౌస్ కీపింగ్ అన్ని కేటగిరిలో కార్మికులకు బోనస్‌గా కాకపోయినా ఎక్స్‌గ్రేషియా, మరో పేరుతో అయినా చెల్లించాల్సి ఉందన్నారు. కొన్ని కంపెనీల్లో కొందరిని కమిటీ మెంబర్లుగా ఎంపిక చేసి వాస్తవాలు చెప్పకుండా కట్టుకథలు చెప్పి బోనస్ ఇవ్వకుండా యాజమాన్యాలు మభ్యపెడుతున్నాయని విమర్శించారు. ఇటువంటి మోసాలకు గురికాకుండా 20 శాతం బోనస్ సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, నాయకులు రాజు, శ్రీను, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు చేతుల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని "మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే" అనే అంశంతో ఈనెల 15న జిల్లా వ్యాప్తంగా చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష రాణి తెలిపారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా సబ్బుతో చేతులు కడుక్కోవాలని, దీని వల్ల డయేరియా, న్యుమోనియా వంటి వ్యాధుల ప్రమాదాన్ని నివారించుకోవచ్చని పేర్కొన్నారు. పిల్లలను అంటు వ్యాధులకు దూరం ఉంచవచ్చన్నారు. ముఖ్యంగా టాయిలెట్ ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవడం మర్చిపోవద్దన్నారు. పరిశుభ్రత పాటించకపోతే చేతులతో కళ్ళు, ముక్కు, నోటిని తాకినప్పుడు వ్యాధులను కలిగించే సూక్ష్మ జీవులు శరీరంలో ప్రవేశిస్తాయని, విరేచనాలు, తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వస్తాయని పేర్కొన్నారు. చేతుల పరిశుభ్రత పాటిస్తే జ్వరం, కడుపునొప్పి, తలనొప్పి, చర్మవ్యాధులు రావని సూచించారు.

సెక్యూరిటీ పరికరం రూపకల్పన

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాల విద్యార్థులు సెక్యూరిటీ పరికరాన్ని తయారు చేశారు. మనం ఎక్కడికైనా ఊరు వెళ్లినప్పుడు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాము రూపొందించిన ఈ పరికరం సహాయంతో దొంగలు పడినప్పుడు చుట్టు పక్కల వారిని అప్రమత్తం చేస్తుందని విద్యార్థులు డైట్ ప్రవల్లిక, నవ్య, జాహ్నవి, మనోజ్‌కుమార్, పవన్ రాజు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి కేవలం రూ.300 ఖర్చు చేసినట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ చెయ్యడానికి ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ సహకరించారన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ డాక్టర్ కె.పార్వతి విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్

స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయంలో దుర్గా శరన్నవరాత్రులు ఈనెల 15న ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు దేవత కామేష్ శనివారం తెలిపారు.ఆదివారం ఉదయం 8.49 నిమిషములకు దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు లలితా సహస్రనామ పారాయణంతో పాటు అమ్మవారి సంకీర్తనలు జరుగుతుందని తెలిపారు. ఈనెల 25 న ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు చండీహోమం జరుగుతుందన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని దుర్గాదేవి ఆలయంలో ఆదివారం నుంచి దుర్గ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలను అలంకరించి రంగులు వేసి ముస్తాబు చేశారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురంలో ఉన్న రాజ రాజేశ్వరిదేవి పీఠంలో ఈ నెల 15 నుండి 28 వరకు దసరా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కె కోటపాడు : స్థానిక షిరిడి సాయి మందిరం వద్ద ఏర్పాటు చేసిన దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వేగి రామారావు శనివారం విలేకర్లకు తెలిపారు. భవానీ భక్తులు, గ్రామ ప్రజలు దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

దేవరాపల్లి : వి.మాడుగులలో ఈ నెల 15 నుండి 23 వరకు జరుగు దేవీ నవరాత్రుల మహోత్సవాల వాల్ పోస్టర్లను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం తారువలోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఉత్సవ కమిటీ వారికి మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దేవరాపల్లి శ్రీను, వైసీపీ నాయకులు బొమ్మిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి ఎఎన్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

బైక్ యాత్ర చేస్తున్న నేతలు

బిఎస్‌పి బైక్ యాత్ర

ప్రజాశక్తి-గొలుగొండ:ఐదో షెడ్యూల్ సాధన కోసం బహుజన సమాజ్ పార్టీ తలపెట్టిన బైక్ యాత్ర శనివారం గొలుగొండ మండలంలోకి ప్రవేశించింది. కసిమి, వడపర్తి గ్రామాల్లో బైక్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్టా నాగరాజు మాట్లాడుతూ, మండలంలో నాన్ షెడ్యూల్ ఆదివాసి గ్రామాల్లో జీవిస్తున్న ఆదివాసీలు గిరిజన హక్కులు కోల్పోతున్నారని, వెంటనే ఐదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. 16వ తేదీన నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని నియోజకవర్గ కార్యదర్శి సంజీవ్ వాడపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కొల్లు గంగాధర్, కిల్లాడ సూరిబాబు, దేముళ్ళు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి -పాయకరావుపేట:సి.బి.ఎస్.ఈ క్లస్టర్ 7 ఖో ఖో పోటీలు ఈనెల 15 నుంచి స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో జరగనున్నాయని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్రా, తెలంగాణా సి.బి.ఎస్.ఈ పాఠశాలల నుండి సుమారు 100 టీమ్‌లు, 1200 మంది విద్యార్థులు పాల్గొన నున్నారని తెలిపారు.

ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధుల రాక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో ఎస్ రామచంద్రమూర్తి తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం ఎంపిడివో సమావేశం ప్రారంభిం చేందుకు సన్నద్ధం అవుతున్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కోన లోవలక్ష్మి, వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు, జెడ్పీటిసి కాకర దేవిలతో పాటు ఎంపిటిసి, సర్పంచ్‌లు తగినంతగా హాజరు కాలేదు. అధికారులు వచ్చి 2గంటలకు సమయం దాటుతున్నా ప్రజాప్రతినిధులు రాకపోవడంతో మధ్యాహ్నం 12గంటల వరకు ఎదురు చూసి తరువాత సమావేశం వాయిదా వేశామని ఎంపిడిఓ తెలిపారు. మండల పరిషత్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు ఎప్పుడూ కుడా సమావేశం వాయిదా పడలేదని సైతారుపేట సర్పంచ్ రావి రమణబాబు తెలిపారు. ఈ విషయమై ఎంపిడివో రామచంద్రమూర్తిని ప్రశ్నించారు.

అధికారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధి

జగనన్న లే అవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట:జగనన్న లే అవుట్లలో సమస్యలు తాండవిస్తున్నాయని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు ఆరోపించారు. శనివారం రోలుగుంట మండలం కంచుగుమ్మల, కొంతలం, శరభవరం, బుచ్చింపేట, బలిజిపాలెం, అడ్డసారం తదితర గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను క్షేత్రస్థాయిలో సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంచుగుమ్మల, శరభవరం, బలిజిపాలెం గ్రామాలలో కనీసం రోడ్లను కూడా పోల్చలేదన్నారు. కొంతలం, బుచ్చింపేటలో కూడా కొన్ని ఇళ్ళు మాత్రమే నిర్మాణం ప్రారంభించారని, కొంతలం గ్రామంలో కొన్ని స్థలాలు వైసిపి నాయకుల అనుకూలంకు చెందిన వారికి నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బలిజ మహారాజు, ప్రధాన కార్యదర్శి పరవాడ దొరబాబు, శివాజీ, ఈశ్వరరావు, వరహాలరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పివిఎస్ఎన్.రాజు

శుభ్రం చేస్తున్న కంపెనీ ఉద్యోగులు

హెటిరో ఆధ్వర్యాన శ్రమదానం

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో ఆధ్వర్యాన ప్రతి శనివారం శ్రమదానం కార్యక్రమం చేపడుతున్నట్లు కంపెనీ ప్రతినిధులు రాజారెడ్డి, ఎస్.కుళ్ళాయిరెడ్డి, ఎం సుబ్బారెడ్డి వెల్లడించారు. నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం పరిసర ప్రాంగణంలో శనివారం కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది శ్రమదానం చేపట్టారు. పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు.ఆవరణతో పాటు తరగతి గదుల్లో కూడా పరిశుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.కె షలీమా, కంపెనీ ఏజీఎం సెక్యూరిటీ మూర్తి, సిఎస్ ఆర్ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయం భక్తుల రద్దీతో కిటకిట లాడింది. శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా ఆలయంలో అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించు కున్నారు. పలువురు స్వాములు, సన్యాసులు వెంకన్నని దర్శించుకున్నారు. సుమారుగా వెయ్యి మందికి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న భక్తులు

ఎపిసిసిలో ఇద్దరికి చోటు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఏపిసీసీ లో నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చోటు దక్కిందని స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మీసాల సుబ్బన్న తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏపిసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ కమిటీ ఏర్పాటు పత్రాలు విడుదల చేశారని, ఇందులో నర్సీపట్నం నియోజక వర్గానికి చెందిన ఇద్దరికి చోటు కల్పించారని ప్రధాన కార్యదర్శిగా రుత్తల శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడిగా మీసాల సుబ్బన్నలను నియమించారన్నారు. గతంలో శ్రీరామమూర్తి డీసీసీ అధ్యక్షునిగా పని చేశారు. గత ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు.

సుబ్బన్న

పరామర్శిస్తున్న ఎంవిఆర్ బృంద సభ్యులు

బాధితులకు ఎంవిఆర్ బృందం పరామర్శ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని గుండుపాల గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసెలు దగ్ధమైన బాధిత కుటుంబాలను ఎంవిఆర్ టీమ్ శనివారం పరామర్శించారు. జరిగిన సంఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని అధైర్యపడద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ పిఆర్ఓ. సతీష్, నర్సీపట్నం నియోజవర్గ ఇన్‌చార్జ్ నానాజీ, మీడియా కన్వీనర్ సూర్యచిన్నినాయుడు, గోపాల్ విగ్నేష్ పాల్గొన్నారు.

పలు చోట్ల 'బాబుతో నేను' ప్రచారం

దేవరాపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాక, వాడ్రాపల్లి గ్రామాలలో బాబుతో మేము సైతం అంటూ టిడిపి నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలలో నాయకులు దాడి ముసలి నాయుడు, మళ్ల వరాహ నరసింహారావు, దాడి శివ, ఆడారి గోవిందరావు, ఇల్లూరి నూక నరసింహారావు, ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తామరబ్బా పంచాయతీ శివారు కొత్త బోడ్డపాడు గ్రామంలో బాబుతో నేను అనే కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు సోమిరెడ్డి గోవింద, పూడి సత్యారావు, టిడిపి నాయకులు గంధం జగ్గారావు, కొల్లుప్రోలు రామలింగస్వామి, ఆదిరెడ్డి అక్కుతాత పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్ భీమవరం, ఆర్ శివరాంపురం గ్రామాలలో శనివారం బాబుతో నేను కార్యక్రమాన్ని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోకవాడ కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, వెయ్యపు అప్పారావు, కోట సత్యనారాయణ, మళ్ళీ రెడ్డి బుజ్జి, దేవర తాతాజీ, సిరిగిరి శెట్టి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన

అనకాపల్లి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక 80వ వార్డు అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ ఆధ్వర్యంలో శనివారం నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అంబేద్కర్ నగర్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి మల్లేశ్వరరావు బుద్ద శ్రీనివాసరావు దూలం ప్రసాదు కూరాకుల చిట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొత్తకోట: తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు రావికమతం మండలం కన్నంపేట, వమ్మవరం గ్రామాలలో శనివారం కరపత్రాలు పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య వంతులు చేస్తామని రాజు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, రావికమతం మండల పార్టీ అధ్యక్షులు రాజన కొండ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బంటు శ్రీను, దంట్ల రాజేష్, ఉగ్గిన శ్రీను, కోట సత్యన్నారాయణ, వెల్లంకి ఈశ్వరరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు శిరిగిరిశెట్టి శ్రీ రామమూర్తి పాల్గొన్నారు.

కోటవురట్ల:మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆరోగ్యం మెరుగు పడాలని శనివారం వెంకటాపురం గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబుతో మేము అనే కార్యక్రమం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, కొడవటిపూడి ఎంపీటీసీ సూర్య ప్రకాష్, జనసేన పార్టీ నాయకులు బాల, మణికంఠ, అడిగర్ల చిన్నబ్బాయి, రావాడ చెల్లయ్య, పైల అప్పలనాయుడు, బిరెడ్డి రాము పాల్గొన్నారు.

ఎస్ రాయవరం:మండలకేంద్రంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించామని మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం రాత్రి మండల మహిళా అధ్యక్షురాలు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోన రామ్మోహన్ రావు, తాడేల గోవిందరావు, బత్తుల వాసు, బత్తుల సూరి బాబు, చీపురుపల్లి చక్రయ్య, అడ్డూరి చిన్న, మోహన్, నాగేశ్వరరావు తాడేలా సంతోష్ పాల్గొన్నారు.

కోటవురట్లలో...

విశాఖ కలెక్టరేట్ : వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ప్రజలు రాజకీయ సమాధి చేయడం ఖాయమని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి జిల్లా కార్యాలయం వద్ద శనివారం ఆ పార్టీ లీగల్ సెల్ విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అయ్యన్న మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ కక్ష సాధింపు చర్యేనని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరాడ రాజబాబు, పీలా శ్రీనివాసరావు, పాశర్ల ప్రసాద్, లీగల్ సెల్ నాయకులు పిఎస్.నాయుడు, రమణ, వెన్నెల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుండి ఆర్‌కె.బీచ్ వద్దనున్న ఎన్‌టిఆర్ విగ్రహం వరకూ టిడిపి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబుది అక్రమ అరెస్టు అని కనిపించిన వారికి తెలియజెప్పారు. టిడిపి జోన్ 1 మీడియా కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్నరెడ్డి, 21వ వార్డు నాయకులు పీతల అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జివి.రామచంద్ర, పోలారావు, నూకరత్నం పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి గణపతినగర్‌లో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, బొడ్డేటి విజయ్ కుమార్, నందవరపు సోములు, మరద ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి నుంచి సింహాచలం వరకు టిడిపి యువనాయకులు చేపట్టిన పాదయాత్ర 3వ రోజు ఆనందపురం మండలం సత్తెరవు జంక్షన్‌కు చేరుకుంది. ఈ పాదయాత్రలో భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కోరాడ రాజబాబు పాల్గొని సంఘీభావం తెలిపారు.

భ్రమలు పెంచేందుకేనా..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ కేంద్రంగా పరిపాలన సాగించనున్నారన్న ప్రచారం బలపడేలా రుషికొండపై పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రభుత్వ చర్యలూ, మంత్రుల మాటలూ ఆ ప్రచారాన్ని ధృవపర్చేలా వున్నాయి. అయితే సారెప్పుడొస్తారు? దసరాకా? లేదంటే పుట్టిన రోజుకా ? అన్న స్పష్టతలేకపోయినా, వచ్చితీరుతారన్న సంకేతాలు ప్రభుత్వం వైపు నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడానికి దారితీసింది తప్ప ఈ ప్రాంత ప్రజల్లో తమ బతుకులు బాగుపడతాయన్న విశ్వాసం ఏ వైపునుంచీలేదు. ఉత్తరాంధ్ర ప్రజల్లో భ్రమలు పెంచి రాజకీయ లబ్ధిపొందడానికి, తమ భూముల విలువ పెంచి అమ్ముకోవడానికి పరిపాలన రాజధాని అస్త్రాన్ని ఓ మార్గంగా ఎంచుకున్నట్లు కనబడుతోంది. పరిపాలన రాజధానిని మార్చడానికి న్యాయపరమైన చిక్కులు వుండడంతో, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమీక్ష పేర అందుబాటులో వుండేందుకు సిఎం క్యాంపు కార్యాలయం సహా అధికారులకు వసతుల కల్పన పల్లవిని ప్రభుత్వం కొత్తగా ఎత్తుకుంది. ఇపుడిక్కడ పరిపాలన కేంద్రం కావాలన్న ఆకాంక్షలేని సామాన్య ప్రజల నుంచి ఆమోదనీయత కోసం బస్సు యాత్ర చేయ సంకల్పించింది. ఈ రాజకీయ క్రీడలో కరువును, కరువుతో బాధపడుతున్న రైతు, ప్రజలను ప్రభుత్వం వదిలేసింది. కరువుతో పంటలువేయలేని, వేసినా వర్షాల్లేక పంట ఇంటికొస్తుందన్న నమ్మకంలేక ఆందోళనతో బతుకుతున్న రైతు పట్ల కనీస సానుభూతి చూపడంలేదు. రైతును ఎలా ఆదుకోవాలన్న ఆలోచన చేయడంలేదు. రాబోయే ఎన్నికల్లో ప్రయోజనం పొందే రాజకీయ అజెండా తప్ప వెనుకబడ్డ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి ఏ ప్రణాళికా ప్రభుత్వం వద్దలేదు.

దర్పణం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మితీరుతామని పంతం పట్టిన మోడీ ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట వైసిపి ప్రభుత్వం అనడంలేదు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు చేపట్టి గ్రామీణ ప్రాంత ప్రజలకు సాగునీరు, నగర ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందిస్తామన్న భరోసా ఇవ్వలేని, ఇవ్వని, నిధులు కేటాయించి ఖర్చుచేయని ప్రభుత్వం... ఎన్నికల ముందు ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరిట ప్రజలను బురిడీ కొట్టించాలని చూస్తోంది. తామేమి చెప్పినా నమ్ముతారన్న ధీమాతో కాబోలు, మళ్లీ సామాన్యులను మోసగించడానికి యాత్ర పేరుతో ప్రజల దగ్గరకు వెళ్తుంది. అధికార అహంకారం తప్ప ప్రజలను విశ్వాసంలోకి తీసుకొని వ్యవహరించాలన్న ఇంకితం ప్రభుత్వంలో ఏ కోశానా కన్పించడంలేదు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ, ప్రతియేటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీ ఎందుకు అమలుచేయలేదో యాత్రకొచ్చిన ప్రభుత్వ పెద్దలను యువత నిలదీసి అడగాలి. సమగ్రాభివృద్ధి సాధనకు ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఐక్యమై పోరాడాలి. పోరాడే పార్టీలకు అండగా నిలబడాలి.

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గణేష్ శనివారం పరిశీలించారు. రహదారి విస్తరణలో భాగంగా సీసీ కాలువ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు ప్రభుత్వ భవనాల తొలగింపు పనులే చేపట్టారు. ల్యాండ్ ఎక్విజేషన్, టీడీఆర్ బాండ్ల ప్రకారం యజమానులు అంగీకారం తెలపడంతో రోడ్డు విస్తరణ చేపట్టడానికి పనులను ప్రారంభించారు. మూడు రోడ్ల జంక్షన్ నుండి పాల్ ఘాట్ సెంటర్ వరకు కాలువ తవ్వకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, 16 వార్డ్ కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, నాయకులు బేతిరెడ్డి విజయ్, కిల్లాడ లోవ, లగుడు స్వామి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ ఈ నెల 26 నుంచి నవంబర్ 2 వరకు గోవాలో జరగబోయే జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా నామినేట్ అయ్యారు. బ్లూ బ్యాడ్జ్ అంపైర్‌గా ఉన్న ఆయన ఇటీవల హాంకాంగ్‌లో ముగిసిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా అర్హత సాధించారు. అంతేకాకుండా ఈ నెల 19 నుంచి 25 వరకు కేరళలోని త్రివేంద్రంలో జరిగే జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు బ్లూ బ్యాడ్జ్ అంపైర్‌గా కూడా ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి నామినేట్ చేయబడిన అంపైర్ శర్మ మాత్రమే. ఆయన ఎల్ఐసిలో హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రీడలకు అతని ఎంపికపై ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జెకె.నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా అనుసంధాన్ యువ, పల్సస్ గ్రూప్ పనిచేస్తున్నట్లు పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాల్లో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్స్, టిపిఒలకు, విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా రాబోయే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పల్సస్ గ్రూప్ అనుసంధాన్ యువ సంస్థతో ముందుకు వెళుతోందన్నారు. కార్యక్రమంలో అనుసంధాన్ యువ సిఇఒ సుభాష్, రాష్ట్రంలోని ఐదు వందల మంది కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు, యూనివర్సిటీ డీన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అరకులోయరూరల్:మండలంలోని లోతేరు పంచాయితీ శిరసగుడ గ్రామంలో శనివారం జల్ జీవన్ మిషన్ పథకం నిధుల ద్వారా తాగునీరు ట్యాంక్ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ గుబాయి కళావతి భూమి పూజ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, గతంలో గ్రామంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బంది పడేవారన్నారు. ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఇటీవల మునగపాక మండలం జెడ్పీహెచ్ స్కూల్‌లో జరిగిన జూనియర్ బాలుర విభాగం త్రోబాల్‌లో గొలుగొండ మండలం పాకలపాడు జెడ్పీహెచ్ స్కూల్ 9వ తరగతి చదువుతున్న కె.రామకిశోర్, గాజువాక మండలం జెడ్పీహెచ్ స్కూల్‌లో జరిగిన సీనియర్ బాలుర విభాగం త్రోబాల్‌లో 10వ తరగతి విద్యార్థి ఎం.రాజేంద్రకుమార్‌లు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.మునగపాక మండలం ఏపి మోడల్ స్కూల్‌లో జరిగిన జూనియర్ బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఎం.నాయుడు, కె.శ్రావణ్‌కుమార్‌లు స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎంఎస్.ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఎంపిక పట్ల జెడ్పీటీసీ గిరిబాబు, ఎంఇఒ, స్కూల్ కమిటీ చైర్మన్, సర్పంచ్, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ గొర్లె ప్రసాద్‌లు అభినందించారు.

ఎస్.రాయవరం:స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు స్థానిక వ్యాయామ ఉపాధ్యాయుడు కె శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 13న ఇందిరా గాంధీ ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్టాఫ్ బాల్ పోటీలను అండర్ 14 బాలుర కేటగిరిలో కే ఫణీంద్ర, బాలికల కేటగిరిలో కే.వాణి దుర్గ, అండర్ 17 బాలుర కేటగిరిలో కే.ప్రసాద్, బాలికల క్యాటగిరిలో కే.కావ్య విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరు నలుగురు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

రాయవరంలో క్రీడాకారులతో ఉపాధ్యాయులు

తొలగించారు.. నిర్మించారు

- అక్రమ కట్టడంపై జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు - ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-కోటవురట్ల: జగనన్న తొలగించమంటే.. స్థానిక ఎమ్మెల్యే నిర్మించుకోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం కోసం అధికారులు కొన్ని సందర్భాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతూ క్షేత్రస్థాయిలో చేతి చమురు సైతం విధుల్చుకుంటూ స్పందన సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా తీవ్ర మనోవేదనకు గురవుతూ తమ వంతు ప్రయత్నం గా పరిష్కార మార్గాలు వెతుకుతున్నారు. ఇక్కడ గ్రామీణ ప్రాంతాలలో కొన్నిచోట్ల అధికారులు తమ పని కర్తవ్యంగా భావించి నిర్వహిస్తూ ఉండగా, రాజకీయ నాయకుల ప్రమేయంతో కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు. మండలంలోని ఎండపల్లి గ్రామానికి సంబంధించి ఇటీవల కాలంలో జగనన్నకు చెబుదాం లో గ్రామానికి చెందిన పలువురు ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న రెవెన్యూ (చెరువు) స్థలం ఆక్రమించుకుని అక్రమ నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు వ్యయప్రయాసలు కోర్చి చేతిచమురు సైతం విదిల్చుకుని నిర్మాణాన్ని జెసిపి సహాయంతో తొలగించారు. సదరు నిర్మాణం తొలగించే అంశంపై అక్రమ నిర్మాణదారులు జెసిబిని ధ్వంసం చేసిన సంఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో రెవెన్యూ అధికారులు, జెసిపి యజమాని పోలీస్ స్టేషన్ సైతం ఆశ్రయించారు.

తొలగించిన కట్టడం

సీన్ కట్ ...చేస్తే ఆక్రమించిన స్థలంలో నిర్మాణం చేపట్టిన షెడ్‌ను రెవెన్యూ అధికారులు తొలగించినా స్థానిక ఎమ్మెల్యే ప్రమేయంతోనే అదే స్థలంలో మళ్లీ నిర్మాణం చేపట్టారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదుల కోసం పరిష్కార మార్గాలు అధికారులు ఒకపక్క శ్రమిస్తూ ఉండగా మరోపక్క రాజకీయ నాయకుల ప్రమేయంతో ఈ కార్యక్రమం పై నమ్మకం సన్నగిల్లే విధంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల మండల వ్యాప్తంగా తీవ్రమైన చర్చ సాగుతోంది.ఎమ్మెల్యే ప్రమేయంతోనే తిరిగి రెవెన్యూ స్థలంలో నిర్మాణం చేపట్టారనే చర్చకు బలం చేకూర్చే విధంగా అధికారులు సైతం నిర్మించిన షెడ్డును తొలగించకుండా మేనమేషాలు లెక్కిస్తున్నారు. ఏమి చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. పలు సంఘాల నాయకులు సైతం తీవ్ర ఆగ్రహం గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆక్రమణ స్థలంలో నిర్మించిన కట్టడం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట:చదువులపై మక్కువ చూపించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలకు స్థానిక ఎస్సై సతీష్ సూచించారు. మండలంలోని శనివారం స్థానిక బాలికల హాస్టల్ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలు విద్యపై పట్టు సాధించి ఉన్నత స్థాయి విద్యా వంతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు విద్యార్థి దశ నుండే అడ్డుకట్టలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.